సాంకేతిక సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి


ఉపాధి హామీ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న పోలిపల్లి రాజు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో 18 ఏళ్లుగా పని చేస్తున్న సాంకేతిక – సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ టెక్నికల్‌ అసిస్టెంట్‌ స్టేట్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు పొలిపల్లి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలిపల్లి రాజు మాట్లాడారు. ఉపాధి ఉద్యోగులైన సాంకేతిక సహాయకులకు కనీస వేతనం రూ.36వేలు ఇవ్వాలని, టీఏడీఏ సౌకర్యాలను పెంచాలని, ఉద్యోగి మరణిస్తే రూ.20లక్షల ఎక్స్‌గేషియా ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. పదేళ్ల నుంచి బదిలీ లేనందున జనరల్‌ ట్రాన్స్‌ఫర్స్‌ జిల్లా, అంతర జిల్లాల బదిలీలు చేపట్టాలన్నారు. అర్హత గల ఉద్యోగులను ఎఫ్‌టీఈలుగా మార్పు చేస్తూ బెనిఫిట్స్‌ వర్తింపజేయాలని, అర్హత కలిగిన టీఏలకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఆరోగ్య బీమా సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్‌ చేశారు. ఈ విషయంపై మంత్రి సీతక్కతో పాటు పంచాయతీ రాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక అధికారులకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఎల్‌.పి.రాము, ఉపాధ్యక్షుడు వి.పద్మారెడ్డి, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ శ్రీహరి, రాష్ట్ర నాయకులు పి.కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య, టైలరింగ్‌ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: ఓయూ దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ మహిళా సభ (డీడీఎంఎస్‌) లిటరసీ హౌజ్‌లో వృత్తి నైపుణ్య సర్టిఫికెట్‌ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎంఎస్‌ ఆఫీస్‌, ఇంటర్నెట్‌, టాలీ ప్రైమ్‌, డీటీపీ, సీలాంగ్వేజ్‌, పైథాన్‌ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని డీడీఎంఎస్‌ లిటరసీ హౌజ్‌ కార్యదర్శి బి. నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా టైలరింగ్‌, ఫ్యాబ్రిక్‌ పెయింటింగ్‌, మగ్గం వర్క్‌, జ్యూట్‌ బ్యాగ్‌ మేకింగ్‌, హ్యాండ్‌ ఎంబ్రాయిడరీ, ఆర్టిఫిషియల్‌ ఫ్లవర్‌ మేకింగ్‌, బ్యూటీషియన్‌ కోర్సు, బ్రైడల్‌ మేకప్‌, మెహిందీ డిజైనింగ్‌, హెయిర్‌ స్టైల్‌, స్పోకెన్‌ ఇంగ్లిష్‌ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. అలాగే సీనియర్‌ సిటిజన్స్‌కు స్పెషల్‌ డిజైన్డ్‌ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆగస్టు 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఫోన్‌ నం.99512 10441/97010 98541లో సంప్రదించగలరు.

జలమండలిలో జనరల్‌ ట్రాన్స్‌ఫర్లను ఆపాలి


ఎమ్మెల్యే రాసిన లేఖను అందజేస్తున్న జి.రాంబాబుయాదవ్‌ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: జలమండలిలో జనరల్‌ ట్రాన్స్‌ఫర్లు ఆపాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వాటర్‌వర్క్స్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ అశోక్‌రెడ్డికి లేఖ రాశారు. మంగళవారం వాటర్‌ వర్క్స్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్‌ ఆధ్వర్యంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాసిన లేఖను జలమండలి అధికారి ఖాదర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలమండలిలో బదిలీల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలన్నారు. స్పందించకుంటే ఎండీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామన్నారు. 'వర్షాకాలం, అత్యవసర పనులు'అనే కారణాలు చూపెట్టి జనరల్‌ ట్రాన్స్‌ఫర్లు చేపట్టడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. బోర్డు మాజీ చైర్మన్‌ పి.నారాయణ, నాయకులు జి.లక్ష్మీనారాయణ, జంగయ్య, కొమురయ్య, ఉదయ్‌కుమార్‌, అంజయ్య, ప్రేమ్‌కుమార్‌, యాదగిరి, వినయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌ను సర్వీస్‌ నుంచి తొలగించాలి

బీఎల్‌ఎఫ్‌ రాష్ట్ర కన్వీనర్‌ దండి వెంకట్‌



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఐఏఎస్‌ అధికారిణి స్మితా సబర్వాల్‌ దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆమెను ప్రభుత్వ సర్వీస్‌ నుంచి రిలీవ్‌ చేయలని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోని సబర్వాల్‌ను ఐఏఎస్‌ సర్వీస్‌ నుంచి తిలగించాలని బహుజన లెఫ్ట్‌ ఫ్రంట్‌(బీఎల్‌ఎఫ్‌) రాష్ట్ర కన్వీనర్‌ దండి వెంకట్‌ డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా నిర్మితమైన అఖిల భారత కేంద్ర సర్వీసుల్లో అత్యంత కీలకమైన పాత్ర పోషించే ఒక ఐఏఎస్‌ అధికారిణి స్మీతా సబర్వాల్‌ తన స్థాయిని దిగజారి దివ్యాంగులపై చేసిన వాఖ్యలు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన ఘటనగా భావించి ఆమెపై వెంటనే కేసు నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్‌ నుంచి రిలీవ్‌ చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఐఏఎస్‌ అధికారిణి సర్వీస్‌ నుంచి తొలగించాలని డిమాండ్‌ చేశారు.

వ్యాపార సముదాయాల్లో పార్కింగ్‌ ఫీజు వసూలు చేయొద్దు

అంబర్‌పేట: జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–16 పరిధిలోని వ్యాపార సముదాయాల్లో పార్కింగ్‌ ఫీజు వసూలు చేస్తే చర్యలు తప్పవని డీఎంసీ మారుతీదివాకర్‌ తెలిపారు. మంగళవారం ఏఎంహెచ్‌వో డాక్టర్‌ హేమాలతతో కలిసి పలు వ్యాపార సముదాయాలను పరిశీలించారు. వ్యాపార సముదాయల్లో వినియోగదారులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఫుడ్‌కోర్టులో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు చేపడుతామన్నారు.


హిమాయత్‌నగర్‌లోని ఓ ఫుడ్‌కోర్టును పరిశీలిస్తున్న డీఎంసీ

ఎమ్మెల్యేను కలిసిన బీమానగర్‌ నూతన కమిటీ



కవాడిగూడ: కవాడిగూడ డివిజన్‌ బీమానగర్‌ (ఎల్‌ఐసీ కాలనీ) నూతన కమిటీ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. గత ఏడేళ్లగా కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌కు పూర్తిస్థాయి కమిటీలు లేకపోవడంతో బీమానగర్‌లో సమస్యలు పేరుకుపోయాయని వారు ఎమ్మెల్యేకు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధ్యక్షుడు వైఎల్‌ఎస్‌ కుమార్‌, ఉపాధ్యక్షుడు కె.సత్యానారాయణ, ప్రధాన కార్యదర్శి రాజేష్‌, బీఆర్‌ఎస్‌ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు విషాల్‌, కాలనీ జాయింట్‌ సెక్రటరీ రేబాకా జకారియా, కోశాధికారి కె. రామకృష్ణ పాల్గొన్నారు.

రైలు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం ... ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన శంకర్‌ (64) వ్యాపారం చేస్తుంటాడు. ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక..

బోనాల పండుగ

కాచిగూడ: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఐపీఎం డైరెక్టర్‌ డాక్టర్‌ సి.శివలీల అన్నారు. మంగళవారం నారాయణగూడలోని ఐపీఎంలో రాసూరి జ్ఞానేశ్వర్‌ ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.సత్యనారాయణగౌడ్‌, బి.వెంకటేశ్వర్‌రెడ్డి, సునీల్‌కుమార్‌, ఎం.శ్రీనివాస్‌రావు, ప్రదీప్‌, ఆర్‌.నరేష్‌ పాల్గొన్నారు.

ఈపీఎఫ్‌ ప్రాంతీయ కార్యాలయంలో..

బర్కత్‌పురలోని ఎంప్లాయిస్‌ ప్రావిడెంట్‌ ఫండ్‌ (ఈపీఎఫ్‌) ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో సెంట్రల్‌ బోర్డు ఆఫ్‌ ట్రస్టీస్‌ (సీబీటీ) మెంబర్‌ సుంకరి మల్లేశం, బర్కత్‌పుర ఈపీఎఫ్‌ కమిషనర్‌–1 డాక్టర్‌ శివకుమార్‌, మాదాపూర్‌ కమిషనర్‌–1 సౌరవ్‌ జగతి, ఆలయ కమిటీ చైర్మన్‌ పెండ్యాల రాంబాబు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘటాన్ని భక్తుల వద్దకే తీసుకెళ్లి దర్శన భాగ్యం కల్పిస్తున్నాం..

ముషీరాబాద్‌: ముషీరాబాద్‌ మహంకాళి దేవాలయ అమ్మవారి ఘటంకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీ శంకర ఆలయ కమిటీ చైర్మన్‌ పి.శ్రీధర్‌చారి, మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్‌ ఎయిర్‌టెల్‌ రాజు, ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రతి ఆషాఢమాసంలో అమ్మవారి ఘటాన్ని భక్తుల వద్దకే తీసుకెళ్లి దర్శన భాగ్యం కల్పిస్తూ ఆధ్యాత్మిక భావనను పెంచుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు వీరేష్‌, పద్మ, నిర్వాహకులు రాము పాల్గొన్నారు.


ఘటానికి పూజలు చేస్తున్న గౌరీ శంకర ఆలయ కమిటీ చైర్మన్‌ పి.శ్రీధర్‌చారి


నారాయణగూడలోని ఐపీఎంలో బోనాల వేడుకల్లో డైరెక్టర్‌ డా. శివలీల


ఈపీఎఫ్‌ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో సీబీటీ మెంబర్‌ మల్లేశం

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: అర్హులందరికీ సీఎం రిలీఫ్‌ ఫండ్‌ పథకంలో లబ్ధి చేకూరేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ తెలిపారు. కాచిగూడకు చెందిన మహేశ్‌కుమార్‌ కుమారుడు ఆదిత్య వైద్య ఖర్చులకు మంజూరైన రూ.2లక్షల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. అదే విధంగా గోల్నాకకు చెందిన సయ్యాద్‌ జహంగీర్‌కు మంజూరైన రూ.1.5లక్షల చెక్కును అందజేశారు.

శుభాకాంక్షలు


ప్రీతంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీబీఎస్‌ఎస్‌ అధ్యక్షుడు రమణారావు

నల్లకుంట: తెలంగాణ షెడ్యూల్‌ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నాగరిగారి ప్రీతం నియమితులయ్యారు. మంగళవారం తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్‌ఎస్‌) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రీతంను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్‌ఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, ప్రచార కార్యదర్శి మంత్రి సునిల్‌, సీనియర్‌ జర్నలిస్ట్‌ అక్కినేపల్లి పురుషోత్తమ రావు తదితరులు పాల్గొన్నారు.

షెట్టర్‌ లిఫ్టింగ్‌ కేసులో ఇద్దరికి జైలు

చిక్కడపల్లి: షెట్టర్‌ లిఫ్టింగ్‌ కేసులో ఇద్దరికి 9నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానాను నాంపల్లి కోర్టు విధించిందని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్‌ సీతయ్య తెలిపారు. మంగళవారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గతేడాది చిక్కడపల్లి మెయిన్‌ రోడ్డులోని న్యూ బందరు మిఠాయి షాపు, రాజీవ్‌రెడ్డి స్వీట్‌షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు షెటర్‌ లిఫ్టింగ్‌ చేసినట్లు ఫిర్యాదు వచ్చింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఏ–1 రాజన్న, ఏ–2 రేగుల రవిని గుర్తించి రిమాండ్‌కు తరలించామన్నారు. మంగళవారం నాంపల్లి కోర్టు ఇద్దరికి 9నెలలు జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధించిందని తెలిపారు.

బోనాల ఉత్సవాల ఏర్పాట్లకు సన్నద్ధం కావాలి

డీఎంసీ మారుతీ దివాకర్‌


అధికారులతో మాట్లాడుతున్న డీఎంసీ మారుతీ దివాకర్‌, తహసీల్దార్‌ వీరాబాయి

అంబర్‌పేట: సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకుంటామని డీఎంసీ మారుతీదివాకర్‌ అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో పాటు అంబర్‌పేట తహసీల్దార్‌ వీరాబాయిలతో కలిపి సమావేశాన్ని నిర్వహించారు. మౌళిక సమస్యలతో పాటు రాబోయే బోనాల ఉత్సవాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లకు సన్నద్ధం కావాలన్నారు. రెవెన్యూ, విద్యుత్‌, ట్రాఫిక్‌, వీధి దీపాలు, జలమండలి, పోలీస్‌ విభాగాల క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేస్తూ బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా కృషి చేస్తామన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండేలా సమన్వయం చేసుకోవాలన్నారు

ఓయూ అమ్మవారి ఆలయానికి భక్తులకు అనుమతి ఇవ్వాలి


ఓయూ యూనివర్సిటీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్‌ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: బోనాల ఉత్సవాల కోసం ఉస్మానియా యూనివర్సిటీ మోయిన్‌ చెరువు కట్టపై ఉన్న అమ్మవారి ఆలయానికి భక్తులకు అనుమతి ఇవ్వాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్‌ బి.పద్మా వెంకట్‌రెడ్డి ఓయూ భద్రత అధికారి రాహుల్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈనెల 28న బోనాల నేపథ్యంలో చెరువు కట్టమీద ఉన్న అమ్మవారి ఆలయం వద్ద బోనాల వేడుకలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, మిర్యాల శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

'ఫీవర్‌' ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు


డాక్టర్‌ జయలక్ష్మిని సన్మానిస్తున్న టీఎంహెచ్‌ఈయూ ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్‌

నల్లకుంట: సాధారణ బదిలీల్లో భాగంగా నల్లకుంట ఫీవర్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను బదిలీ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో కొత్తగా వారు ఎవరినీ నియమించలేదు. దీంతో ఉన్నతాధికారుల సూచనలతో ఆస్పత్రి సీఎస్‌ ఆర్‌ఎంవో డాక్టర్‌ జయలక్ష్మి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్‌, యూనియన్‌ ప్రతినిధులు డాక్టర్‌ జయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్‌ఈయూ ఫీవర్‌ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్‌, ఉపాధ్యక్షులు జనార్దన్‌, పద్మ, సంయుక్త కార్యదర్శి గ్లోరీ, రాఘవేంద్ర, నళిని, ఉమాదేవి, పాల్‌ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నల్లకుంట: మానసిక స్థితి సరిగాలేని వ్యక్తి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పగుల భూమ్‌రెడ్డి(54), విజయ లక్ష్మి దంపతులు అడిక్‌మెట్‌ ఫ్లైఓవర్‌ బ్రిడ్జ్‌ సమీపంలో నివాసముంటున్నారు. భూమ్‌రెడ్డికి పదేళ్లగా మానసిక స్థితి సరిగాలేదు. ఈనెల 2న మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన విజయలక్ష్మి తమ భర్త కనిపించడంలేదంటూ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భూమ్‌రెడ్డి గతంలోనూ ఇంట్లో చెప్పకుండా వెళ్లి నాలుగైదు రోజుల్లో తిరిగి వచ్చేవారని విజయ లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని 1098 మెట్రో పిల్లర్‌ సప్తగిరి థియేటర్‌ ఫుట్‌పాత్‌పై వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదన్నారు.

బడ్జెట్‌ ముచ్చట్లు

కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. కొందరు సానుకూలంగా స్పందిస్తే.. కొందరు విమర్శలు చేస్తున్నారు. అయితే ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వారేమంటున్నారో వారి మాటల్లోనే చూద్దాం.

మహిళా స్వావలంబనకు బాటలు వేసింది



చిక్కడపల్లి: మహిళల ఆర్థిక స్వావలంబనకు కేంద్ర బడ్జెట్‌లో బాటలు వేసింది. ఈ బడ్జెట్‌ సమాజంలోని అన్నివర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. విద్య, ఉద్యోగ కల్పన, స్వయం ఉపాధికి ప్రాధాన్యం కల్పించారు. దేశీయ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు రూ.10లక్షల ఎడ్యుకేషన్‌ లోన్‌ ప్రకటించడం మంచి నిర్ణయం. మొత్తానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ బాగుంది. – గాంధీనగర్‌ కార్పొరేటర్‌ పావని

తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరం



చిక్కడపల్లి: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరం. బడ్జెట్‌లో కేవలం రెండు రాష్ట్రాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. దీనిలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న రాష్ట్రానికి ఈ బడ్జెట్‌లో దక్కింది గుండు సున్నా. మధ్య తరగతి ప్రజలు, రైతులకు మొండిచేయి చూపింది. కేవలం ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకే బడ్జెట్‌ను రూపొందించారు.
– గాంధీనగర్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు అభిషేక్‌ కెనడీ

పేద, మధ్య తరగతి ప్రజలకు అనుకూలం



కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ పేద, మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా ఉంది. దేశ సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను రూపొందించినట్లు ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ బడ్జెట్‌ దోహదపడుతుంది. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారు. పట్టణాలలో పేదల ఇంటి నిర్మాణ కలను నెరవేర్చేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. యువత, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసి పలు పథకాలకు రూపకల్పన చేసింది. పన్ను చెల్లింపుదారులకు చేయూతను అందించడం అభినందనీయం. – హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా. ఎన్‌.గౌతంరావు

బిహార్‌, ఆంధ్ర రాష్ట్రాల బడ్జెట్‌గా కేంద్ర బడ్జెట్‌



కవాడిగూడ: పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ ఆంధ్రప్రదేశ్‌, బిహార్‌ రాష్ట్రాలకు సంబంధించిన బడ్జెట్‌లాగా ఉంది. తెలంగాణలో కాంగ్రెస్‌, బీజేపీ ఎంపీల అసమర్థత వల్లనే బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపించింది. తెలంగాణకు సంబంధించిన ఒక్క డిమాండ్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం. – బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేత ఎన్‌డీ సాయికృష్ణ

కార్మికులకు అన్యాయం



ముషీరాబాద్‌: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపారు. ఖాజీపేట రైల్వే కోచ్‌ ఏర్పాటుకు నిధులు కేటాయించలేదు. తెలంగాణలో రైల్వే అభివృద్ధికి, లఘు పరిశ్రమలకు నిధులు కేటాయించకపోవడం అన్యాయం. తెలంగాణలో నిరుద్యోగులకు న్యాయం జరిగేలా బడ్జెట్‌ కేటాయించాలి. కానీ అలా చేయలేదు. – ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి

విద్యారంగాన్ని విస్మరించారు..



ముషీరాబాద్‌ తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్‌ కేటాయింపులు లేకపోవడం చాలా దుర్మార్గం. దేశ భవిష్యత్‌కు దిక్సూచి అయిన విద్యారంగానికి కేవలం రూ.1,25,638 కోట్లు మాత్రమే కేటాయించింది. తక్కువ డబ్బులు కేటాయించి విద్యా రంగాన్ని విస్మరించింది. విభజన హామీల్లో భాగంగా తెలంగాణ కేటాయించాల్సిన ఐఐఎం, ఐఐటీ, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు బడ్జెట్‌లో చోటు దక్కలేదన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 6మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా రాష్ట్రానికి అన్యాయం జరిగింది.
– పీడీఎస్‌యూ తెలంగాణ అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ

కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా లేదు..



తెలంగాణ అనే పదమేలేని అన్యాయమైన కేంద్ర బడ్జెట్‌ ఇది. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా లేదు. విభజన హామీలో పొందుపరిచిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు కేటాయించలేదు. తెలంగాణకు నిధులు రాబట్టడంలో రాష్ట్ర కాంగ్రెస్‌ ప్రభుత్వం, బీజేపీ ఎంపీలు విఫలమయ్యారు. బడ్జెట్‌ విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఎంత మోసం చేసిందో రాష్ట్ర కాంగ్రెస్‌ ప్రభుత్వం కూడా అంతే మోసం చేసింది.
– నాగేష్‌ ముదిరాజ్‌, బీఆర్‌ఎస్‌ నేత

తెలంగాణకు మొండిచేయి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకపోవడం దారుణం. తెలంగాణకు మొండిచేయి చూపింది. ఈ విషయంపై కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ సమాధానం చెప్పాలి. రాబోయే రోజుల్లో బీజేపీకి తెలంగాణ ప్రజలు సరైన గుణపాఠం చెబుతారనడంలో ఎలాంటి సందేహం లేదు.
లింగాల శ్రీకాంత్‌గౌడ్‌, పీసీసీ ప్రధాన కార్యదర్శి

ఇది అమలుకు నోచుకోని బడ్జెట్‌..



కేంద్ర బడ్జెట్‌లో నిరుద్యోగ యువతకు నిరాశే మిగిలింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిధులు కేటాయించకుండా తమ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకే ఎక్కువ శ్రమించినట్లు కనబడింది. గత కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాపీ కొట్టారు. 8మంది బీజేపీ ఎంపీలను ప్రజలు ఢిల్లీకి పంపించినా నిధులు రాబట్టడంతో విఫలం చెందారు. ఇది కేవలం అంకెల గారడీ తప్ప అమలుకు నోచుకోని బడ్జెట్‌.
– ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌, రాజ్యసభ సభ్యుడు

నిరుద్యోగులకు ఆశాభంగం



లోక్‌సభ ఎన్నికల్లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పి ఉన్న ఉద్యోగాలను తొలగించడానికి ఎసరు పెట్టే విధానాలు తీసుకొచ్చారు. దీంతో నిరుద్యోగ యువతకు ఆశాభంగం కలిగింది. ఇటీవల జరిగిన స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కోసం ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. కానీ ఆచరణలో పెట్టలేదు. రూ.లక్షన్నర కోట్ల కేటాయింపు అనేది కాగితాలకే పరిమితం అవుతుంది. యువ సంపద కలిగిన దేశంలో ప్రతి బడ్జెట్‌లో యువతకు ప్రాధాన్యం ఉండాలి.
– కేఎస్‌ ప్రదీప్‌, పీవైఎల్‌ రాష్ట్ర అధ్యక్షుడు

విభజన హామీల అమలుకు నిధులేవీ?



తెలంగాణ పదాన్నే ఉచ్చరించడానికి ఇష్టపడని కేంద్ర ప్రభుత్వం అదే విధంగా నిధులు కూడా కేటాయించకుండా నిర్లక్ష్యం వహించింది. పెండింగ్‌ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి... విభజన హామీలను నెరవేర్చడానికి ప్రత్యేక నిధులను కేటాయించాల్సింది పోయి ఉన్నవాటికే కోతలు పెట్టడం విడ్డూరంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ట్రిపుల్‌ ఆర్‌ ప్రాజెక్టుకు, మూసీ రివర్‌ ప్రాజెక్టుకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ఈ బడ్జెట్‌తో సామాన్యులకు ఒరిగింది ఏమీ లేదు.
– ఎం.నర్సయ్య, గ్రేటర్‌ హైదరాబాద్‌ టీజేఎస్‌ అధ్యక్షుడు

తెలంగాణపై సవతి తల్లి ప్రేమ



లోక్‌సభలో ప్రవేశపెట్టిన రూ.48లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణకు ఇచ్చింది గుండు సున్నా. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా వారు నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. బీజేపీ నేతల మాటలు కోటలు దాటుతాయి. కానీ చేతలు మాత్రం గడప దాటడం లేదు. బడ్జెట్‌లో అన్ని రంగాలను కేంద్రం విస్మరించింది. కార్పొరేట్‌ శక్తులు, పెట్టుబడిదారులకు పెద్దపీట వేసి తమ నైజాన్ని చాటుకుంది. మొత్తానికి కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై సవితి తల్లి ప్రేమ చూపించింది.
– ముఠా జైసింహ, బీఆర్‌ఎస్‌ యువజన నేత